సామాజిక సాధికారతే లక్ష్యంగా..

- రాష్ట్రంలో సంక్షేమ, సామాజిక విప్లవం
- నాలుగున్నరేళ్లలో కనిగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు
- డీబీటీ, నాన్ డీబీటీ పథకాల ద్వారా 1,78,489 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు రూ.903.25 కోట్ల లబ్ధి


సంక్షేమ పథకాల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా(ఫైల్)

కనిగిరి రూరల్: సామాజిక సాధికారతే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అనేక బృహత్తర సంక్షేమ పథకాలను అమలు చేశారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నో కార్యక్రమాలను చేపట్టారు. బడుగు బలహీన వర్గాల జీవితాల్లో గుణాత్మకమైన మార్పునకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టి, వారి అభ్యున్నతికి ఎంతో తోడ్పాటు నందిస్తున్నారు. వైఎస్సార్ చేయూత, జగనన్న చేదోడు, వైఎస్సార్ కళ్యాణ మస్తు, వైఎస్సార్ పెన్షన్ కానుక, ఆసరా, కాపు నేస్తం, అమ్మ ఒడి, ఈబీసీ నేస్తం, పంటల బీమా, రైతు భరోసా, వంటి 27 రకాల పథకాలను నేరుగా అందిస్తూ, బడుగు వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం బంగారు బాటలు వేస్తోంది.

నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ఒక్క కనిగిరి నియోజకవర్గంలోని సచివాలయాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ప్రత్యక్ష నగదు బదిలీ కింద 94254 మందికి రూ.730.87 కోట్లు, పరోక్ష బదిలీ నాన్ డీబీటీ ద్వారా 84235 మందికి రూ.172.37 కోట్లు అందజేశారు. అలాగే ఇతర కులాల్లో 49890 మంది లబ్ధిదారులకు డీబీటీ ద్వారా రూ.422.50 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా 25834 మందికి రూ.56.85 కోట్లు మొత్తం 75,724 మంది లబ్ధిదారులకు రూ.479 కోట్ల ప్రయోజనం చేకూరింది. నియోజకవర్గంలోని ఓటర్లలో దాదాపు 65 శాతానికి పైగా ప్రజలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లబ్ధి చేకూరింది. దీనికి అదనంగా నియోజకవర్గంలోని సుమారు 20 వేల మందికి ఇంటి నివేశన స్థలాలు ప్రభుత్వం అందచేసింది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని అన్ని సామాజిక వర్గాల ప్రజల్లో ఆనందాలు, సంతోషాలు విరజిల్లుతున్నాయి.

> **రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం**
> సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం అమలవుతోంది. పేద, బడుగు బలహీన వర్గాల జీవన స్థితి గతులు మార్చి వారికి మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించి, సామాజిక సాధికారత లక్ష్యంతో మా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. గత పాలకులు దళిత, బడుగు బలహీన వర్గాల ప్రజలను ఓటు బ్యాంక్‌గా చూసింది. నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని రంగాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు పెద్ద పీట వేసింది. సంక్షేమ పథకాలతో పాటు, రాజ్యాధికారంలో కూడా భాగస్వామ్యం కల్పించింది.
> – బుర్రా మధుసూదన్ యాదవ్

పంటలకు జీవం పోసిన వర్షం


చెరువును తలపిస్తున్న సింగరాయకొండ జూనియర్ కాలేజీ ఆవరణ

కొండపి(సింగరాయకొండ): అల్పపీడనం కారణంగా కొండపి మండలంలో సోమవారం 28.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వర్షం వాణిజ్య పంటలకు జీవం పోసిందని వ్యవసాయాధికారి విజయకుమార్ పేర్కొన్నారు. ప్రస్తుతం మండలంలో 7 వేల ఎకరాల్లో పొగాకు, 500 ఎకరాల్లో మిరప, 4 వేల ఎకరాల్లో కంది, 150 ఎకరాల్లో వరి సాగు చేశారు. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యంలో నీటి కష్టాలు తీరతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సింగరాయకొండలో 98.6 మి.మీ వర్షపాతం

సింగరాయకొండ: మండలంలో సోమవారం 98.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రాంగణం వర్షం నీటితో చెరువును తలపించింది. వరి నారు పోసుకోవడానికి ఈ వర్షం ఎంతో అనుకూలమని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు.

ఉద్యాన పంటలకు ఊపిరి

ఉలవపాడు: రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఉద్యానపంటలు ఊపిరి పోసుకుంటున్నాయి. . ఉలవపాడు ప్రాంతంలో ప్రధానంగా పండించే మామిడి, సపోట తోటలకు ఈ వర్షంతో కాస్త ఊరట కలిగింది. మామిడి, సపోట చెట్లు ప్రస్తుతం బెట్ట తగిలి ఉన్నాయి. కొందరు రైతులు మోటార్ల ద్వారా నీరు కట్టే పరిస్థితిలో ఉన్న సమయంలో కురిసిన ఈ వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మండల పరిధిలో 113.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

లింగసముద్రం: మండలంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. మండలంలో 97.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ టి.ప్రసాద్ తెలిపారు.

కషాయాలు ఉండగా.. రసాయనాలు దండగ

టంగుటూరు: ప్రకృతిలో లభించే ఆకులతో కషాయాలు తయారు చేసుకుని చీడ పురుగులను నివారించవచ్చనని ప్రకృతి వ్యవసాయాధికారి టి.విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని మర్లపాడు గ్రామంలో సోమవారం రైతులకు అగ్ని అస్త్రం కషాయం తయారీ విధానం, వాటి ఉపయోగాలపై అవగాహన కల్పించారు. 20 లీటర్ల ఆవు మూత్రం, రెండు కేజీల పచ్చిమిర్చి, ఒక కేజీ పొగాకు చూర, ఐదు కేజీల వేపాకు, రెండు కేజీల వెల్లుల్లిని మెత్తటి మిశ్రమంగా చేసి పొయ్యి మీద ఒక పాత్రలో ఉంచి మూడు పొంగులు వచ్చే వరకు ఉడికించాలని సూచించారు. అలా ఉడికించిన తర్వాత వచ్చిన మిశ్రమాన్ని వడ కట్టిన తర్వాత వచ్చే ద్రవాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి పంటలపై పిచికారీ చేస్తే చీడపీడలను నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని, అధిక ఆదాయం లభిస్తుందని చెప్పారు. ప్రకృతి సాగుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి తోడ్పాటు నందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎల్–2 విజయలక్ష్మి, ఫార్మర్ సైంటిస్ట్ సద్గుణ, ఐసీఆర్పీలు శృతి, హరిత, మరియమ్మ, సుజాత, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

9 నుంచి సంక్షేమ లబ్ధి వివరాల ప్రదర్శన

టంగుటూరు: మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో సంక్షేమ పథకాల లబ్ధి వివరాలు ఈ నెల 9 నుంచి 23వ తేదీ వరకు ఈఓఆర్డీ నర్రా జగదీష్ ఆధ్వర్యంలో ప్రదర్శిస్తారని ఎంపీడీఓ రత్నజ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తేదీన టంగుటూరు–1, 10న టంగుటూరు–2, 14న టంగుటూరు– 3, 15న టంగుటూరు– 4, 16న వల్లూరు, 17న సూరారెడ్డిపాలెం, 20న తూర్పు నాయుడుపాలెం, 21న ఆలకూరపాడు, 22న మల్లవరప్పాడు, 23న కాకుటూరివారిపాలెంలో కార్యక్రమాలకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని ఆదేశించారు. రెండు రోజుల ముందు వలంటీర్లు ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించాలని, షెడ్యూల్ తర్వాత వారం రోజుల వరకు అవగాహన కల్పించి ఈకేవైసీ తీసుకోవాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో నాగార్పమ్మ కొలుపులు

పామూరు: మండలంలోని పోతవరంలో గ్రామదేవత నాగార్పమ్మ కొలుపులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు నాగార్పమ్మ మూలవిగ్రహమూర్తికి అభిషేకం, కుంకుమపూజ నిర్వహించారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ప్రజారక్షణ భేరి సభను విజయవంతం చేయండి

కొండపి(సింగరాయకొండ): కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఎంతో అన్యాయం చేసిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు విమర్శించారు. కొండపి ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లో సోమవారం అమరవీరుల స్థూపం వద్ద ప్రజారక్షణ భేరి కరపత్రాలు పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈనెల 15వ తేదీన విజయవాడలో నిర్వహిస్తున్న సభను, అలాగే మంగళవారం కొండపిలో బస్సుజాతాను విజయవంతం చేయాలని కోరారు.

పక్కాగా ఓటరు జాబితా

టంగుటూరు: తప్పుల్లేని ఓటరు జాబితా రూపొందించడమే ఎన్నికల కమిషన్ లక్ష్యమని తహసీల్దార్ సంజీవరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఒకటో సచివాలయంలో బీఎల్వో, బీఎల్ఏలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఎల్వో, బీఎల్ఏలు ఇద్దరూ ముసాయిదా ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. సవరణలు ఏమైనా ఉంటే బీఎల్ఓకు దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీటీ శ్రీనాథ్, ఈఓఆర్డీ నర్రా జగదీష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

'వై ఏపీ నీడ్స్ జగన్' విజయవంతం చేయాలి

పీసీపల్లి: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ నెల 9 నుంచి పీసీపల్లి మండలంలో నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా మండలంలోని ప్రతి సచివాలయంలో ఈ నెల 9 నుంచి ప్రభుత్వ పథకాల సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తామన్నారు. ప్రతి వలంటీర్ తమకు కేటాయించిన ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తారన్నారు.

లే అవుట్ల పరిశీలన

గుడ్లూరు: మండలంలోని మోచర్ల పంచాయతీ పరిధిలో తెట్టు, రామాయపట్నం గ్రామాల మధ్య నూతనంగా ఏర్పాటు చేసిన లే అవుట్లను ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు సోమవారం పరిశీలించారు. లే అవుట్లకు సంబంధించిన అనుమతుల పత్రాలను ఆయన పరిశీలించారు. మొత్తం ఐదు లే అవుట్లు ఉండగా కేవలం ఒక లే అవుట్‌కు మాత్రమే నుడా అనుమతులు ఉన్నట్లు తెలిపారు. మిగిలిన నాలుగు లే అవుట్లకు వాటి యాజమానులు ఇప్పటి వరకు ఎటువంటి అనుమతులను తీసుకోలేదన్నారు. అనుమతులు తీసుకోని నాలుగు లే అవుట్లకు నోటీసులు పంపనున్నట్లు తెలిపారు. ప్రతి లే అవుట్ యాజమానులు నుడా అనుమతులు తీసుకున్న తర్వాత ఆ పత్రాలను సంబంధిత పంచాయతీ కార్యాలయంలో అందజేసి ఎల్‌పీ నంబర్లను కచ్చితంగా తీసుకోవాలన్నారు. పంచాయతీ అనుమతులు లేకుండా లే అవుట్లలో స్థలాలు కొనుగోలు చేసినా అమ్మినా పంచాయతీ ఎటువంటి బాధ్యత వహించదన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఇషా ఉన్నారు.

పాఠశాలకు పుస్తకాలు అందజేత

కనిగిరి రూరల్: విద్యార్థుల్లో పుసకం చదివే శక్తి, విజ్ఞాన శక్తి పెంపొందించేందుకు కృషి చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక దేవాంగ నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో పుస్తక మిత్ర కార్యక్రమంలో భాగంగా వాసవీ లైబ్రరీ ఇనిషియేటివ్ ద్వార సుమారు రూ. 20 వేల విలువైన లైబ్రరీ పుస్తకాలను జగన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం అందచేశారు. అనంతరం హెచ్ఎం కె.పద్మావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర నాయకులు సీపీ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పుస్తకాలపై ఆసక్తి పెంపొందించాలన్నదే తమ ఉద్దేశమన్నారు. ఎంఈఓ యు వి.నారాయణరెడ్డి, డాక్టర్ గురుబ్రహ్మం, సి. ప్రసాద్, ఉండేల మాలకొండారెడ్డి, మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఆంజనేయరెడ్డి, విద్యా కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో విప్లవాత్మకమైన మార్పులు

- ఎమ్మెల్యే, బుర్రా మధుసూదన్ యాదవ్


వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, పార్టీ శ్రేణులు

కనిగిరి రూరల్: సంక్షేమ పథకాలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశం చరిత్రలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. ప్రజా సంకల్ప యాత్ర ప్రారంభించే నేటికి ఆరేళ్లు అయిన సందర్భంగా స్థానిక స్థానిక వైఎస్సార్ భవన్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అనంతరం కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలతో పాటు, నవరత్నాల పథకాలను అమలు చేసి దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారని కొనియాడారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ చేపట్టిన సామాజిక,సాధికారయాత్ర ఈనెల 8న కనిగిరికి రానుందని, సాయంత్రం నాల్గు గంటలకు జరిగే బహిరంగ సభకు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల వారంతా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, వైస్ చైర్మన్లు పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, ఆర్ మాణిక్యరావు, లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు పెరుగు మురళీ కృష్ణా, సీహెచ్ సాల్మన్, తమ్మినేని సుజాత, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, మాజీ ఎంపీటీసీలు జిలాని, జాని, సయ్యద్ నాయబ్ రసూల్, పండ్ల ఖాదర్, సిరుప వెంకట గోవర్ధన్‌రెడ్డి, పార్టీ పట్టణ,మండల యూత్ అధ్యక్షుడు డాక్టర్ రసూల్, మాలీ, అరుణోదర్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ రెండు కళ్లుగా పాలన

- రూ.11 కోట్లతో కనిగిరి–కలగట్ల రోడ్డుకు శంకుస్థాపన


రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. మండలంలోని కనిగిరి టు పాలవరం, కలగట్ల (5 గ్రామాలకు చెందిన) 12 కిమీల ఆర్‌ఆర్‌బీ రోడ్డుకు రూ 11 కోట్లు (ఎండీఆర్ ప్లాన్ నిధులు) మంజూరై టెండర్లు పూర్తి కావడంతో సోమవారం ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ శంకుస్థాపన చేశారు. సర్పంచ్ మునగల కోటమ్మ బ్రహ్మరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ మాట్లాడుతూ శతాబ్దాల కాలం నుంచి ఈ రోడ్డు మట్టి రోడ్డుగా ఉండటంతో రోడ్డు అభివృద్ధి గూర్చి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించినట్లు చెప్పారు. నాల్గు నెలల్లో రోడ్డు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. రోడ్డు నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు చెప్పారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, సొసైటీ చైర్మన్ సంగు సుబ్బారెడ్డి, వైస్ చైర్మన్లు పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, ఆర్ మాణిక్యరావు, తమ్మినేని సుజాతరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎస్ రంగనాయకులరెడ్డి, జేసీఎస్ పట్టణ, మండల కన్వీనర్లు వేల్పుల వెంకటేశ్వర్లు యాదవ్, అట్లూరామచంద్రారెడ్డి, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, అట్లా మాలకొండయ్య, పాలూరి వెంకటరెడ్డి, లక్ష్మీ కుమారి, పేరం కొండారెడ్డి, పాలూరి కొటిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో కనిగిరి నుంచి హైదరాబాద్ మీదుగా బీహెచ్ఈఎల్‌కు ఏర్పాటు చేసిన 'స్టార్ లైనర్' నాన్ ఏసీ స్లీపర్ కోచ్ బస్సును సోమవారం ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో డిపో నుంచి మరిన్ని బస్సు సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ఉన్నత లక్ష్యంతో ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసి ఎంతో మేలు చేశారని గుర్తు చేశారు.

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.1.69 లక్షలు


ఆలయ ఈఓ, చైర్మన్‌కు విరాళం అందజేస్తున్న దాతలు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.1,69,740 ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ జి.రమణారెడ్డి సోమవారం తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.50,380, లడ్డుప్రసాదం అమ్మకం ద్వారా రూ.26,970, శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ..42,390, మహాప్రాకార నిర్మాణానికి పొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా తిమ్మారెడ్డిపల్లె గ్రామానికి చెందిన గుమ్మాల నాగేంద్రబాబు, నారాయణలు రూ.50 వేలు విరాళాన్ని చైర్మన్, ఈఓకు అందజేశారు. ఈసందర్భంగా వారు దాతలను సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

వెంకటేశ్వరరెడ్డికి పరామర్శ

సీఎస్‌పురం (పామూరు): సీఎస్‌పురంకు చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి అనారోగ్యంతో బెంగుళూరులోని వైద్యశాలలో చికిత్సపొందారు. ఈసందర్భంగా సోమవారం సీఎస్‌పురంలోని పాలకొల్లు నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే..వెంకటేశ్వరరెడ్డిని పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ మేకల శ్రీనివాసులు, పార్టీ మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, యూత్ మండల అధ్యక్షుడు యం.అటీలయ్య, మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ బజాజ్‌బుజ్జి, సింగిల్‌విండో డైరెక్టర్ వాడా లక్ష్మిరెడ్డి, ఇర్లా వీరాంజనేయులు, బత్తుల దేవరాజు ఉన్నారు.

కె.అగ్రహారంలో ఆక్రమణల తొలగింపు


కె.అగ్రహారంలో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న అధికారులు

పొన్నలూరు: మండలంలోని కె.అగ్రహారం గ్రామంలో ఓవీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న అక్రమ నిర్మాణాలను సోమవారం ఆర్అండ్‌బీ అధికారుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు తొలగించారు. వివరాలు.. ఓవీ రోడ్డు విస్తరణలో భాగంగా ఏడాది క్రితం రోడ్డుకు ఇరువైపులా ఉన్న అక్రమ నిర్మాణాలను అధికారులు తొలగించారు. ఇదే క్రమంలో రోడ్డు పక్కనే ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని కూడా విగ్రహ కమిటీ సభ్యుల అంగీకారంతో ఆర్అండ్‌బీ అధికారులు పక్కకు మార్చారు. అయితే ఇటీవల ఓవీ రోడ్డు విస్తరణ పనులు పూర్తికావడంతో మళ్లీ కొందరు రోడ్డు పక్కన బంకులు ఏర్పాటు చేసి గదులు నిర్మించారు. అలాగే గతంలో అంబేడ్కర్ విగ్రహం ఉన్న ప్రదేశంలో కొందరు కావాలనే సిమెంట్ రేకులతో బస్ షెల్టర్ ఏర్పాటు చేశారు. అలాగే అంబేడ్కర్ విగ్రహం సమీపంలో బంకు పెట్టారు. అంబేడ్కర్ విగ్రహం కనిపించకుండా ఉండేందుకే బస్ షెల్టర్ ఏర్పాటు చేశారని, అలాగే రీడింగ్ రూమ్ నిర్మాణానికి అది ఆటంకమని దళితులు నిరసనకు దిగారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, కొండపి సీఐ పాండురంగారావు దగ్గరుండి ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించారు.

బస్సుయాత్రను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న పార్టీ మండల అధ్యక్షుడు హుసేన్‌రెడ్డి

పామూరు: కనిగిరిలో ఈనెల 8వ తేదీ జరగనున్న సామాజిక సాధికార బస్సుయాత్రను జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం పార్టీ నాయకులతో బస్సుయాత్ర విజయవంతంపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా హుసేన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించడమే సామాజిక సాధికార బస్సుయాత్ర లక్ష్యమన్నారు. అర్హతే ధ్యేయంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నారు. కోఆప్షన్ నాయబ్‌రసూల్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సెంట్రింగ్ చాంద్ బాషా, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, యాదాల వెంకట సాయికిరణ్, గట్లా విజయభాస్కర్ రెడ్డి, జిల్లా కమిటీ మెంబర్ జొన్నలగడ్డ గోవిందయ్య, షేక్.నాయబ్‌రసూల్, పాలేటి ప్రేమ్, పోతల రమేష్, శ్రీరాం శ్రీను పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: కనిగిరిలో ఈ నెల 8న జరిగే సామాజిక సాధికారిక బస్సుయాత్రను జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ గాయం సావిత్రి సోమవారం ఒక ప్రకటల్లో కోరారు. బస్సుయాత్రకు మండలం నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరు కావాలన్నారు.

ఉరేసుకుని కూలీ ఆత్మహత్య


గంగరాజు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్సై రవికుమార్

వెంకటకృష్ణాపురం(మద్దిపూడి): పొగ నారుమళ్లలో కూలీ పనులు వెళ్తూ జీవనం సాగిస్తున్న ఓ యవకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మద్దిపూడి మండలంలోని వెంకటకృష్ణాపురం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన మండపాటి గంగరాజు(35)తోపాటు మరో 10 మంది కూలీలు పొగ నారుమళ్లలో పనిచేసేందుకు వెంకటకృష్ణాపురం వచ్చారు. గంగరాజు మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యతోపాటు తన ముగ్గురు బిడ్డలు గత కొన్ని నెలలుగా దూరమయ్యారు. ఈ క్రమంలో మనస్తాపం చెందిన గంగరాజు సోమవారం పూటుగా మద్యం సేవించి కూలీలు నివాసం ఉంటున్న బ్యారన్‌లో మద్యం మత్తులో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనా స్థలాన్ని ఏఎస్సై రవికుమార్ చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గంగరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీఆర్వో ఏబేలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

మున్సిపల్ స్పందనకు 12 అర్జీలు


కందుకూరులో కమిషనర్‌కు అర్జీ ఇస్తున్న ముప్పవరపు కిశోర్

కందుకూరు: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 12 ఫిర్యాదులు వచ్చినట్లు కమిషనర్ మనోహర్ తెలిపారు. జేసీఎస్ కో ఆర్డినేటర్ ముప్పవరపు కిశోర్ తమ వార్డు ఆదియేంద్ర కాలనీలో సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమీషనర్‌కు వినతి త్రం అందజేశారు. ప్రధానంగా కోటారెడ్డి క్లబ్ నుంచి ఆదియేంద్ర కాలనీకి వెళ్లే రహదారి పూర్తిగా గుంతలమయమై ప్రయాణానికి ఇబ్బందికరంగా ఉందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. గతంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి సూచించిన విధంగా ఎంపీపీ స్కూల్ ఎదురు సైడ్ కాల్వను, కాలనీకి ఉత్తరంవైపు ఉన్న వరదనీటి కాల్వను పూర్తి చేయాలని కోరారు. ఎస్టీ కాలనీకి నీటి పైప్‌లైన్ వేసి నీటి కష్టాలు తీర్చాలని, బైపాస్ రోడ్డు నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో వెంటనే పనులు పూర్తి చేయాలని కోరారు. వీటిపై స్పందించిన కమిషనర్ ఆయా విభాగాల అధికారులకు సూచనలు చేశారు.

లింగసముద్రం: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన జగనన్నకు చెబుదాం స్పందనకు నాలుగు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ టి.ప్రసాద్ తెలిపారు. 1బి, అడంగల్‌లో డిజిటల్ సంతకం కోసం ఒకటి, పట్టాదార్ పాస్‌పుస్తకం కోసం మరొకటి, జనన ధ్రువీకరణ సర్టిఫికెట్ కోసం రెండు అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు.

ఉలవపాడు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన స్పందనకు 4 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ బ్రహ్మయ్య తెలిపారు. అర్జీలను వారం రోజుల్లోగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

అన్నప్రసాద భవనానికి విరాళం

కందుకూరు: పట్టణంలోని కనిగిరి రోడ్డులోని అయ్యప్పస్వామి గుడి ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న అన్నదానం భవన నిర్మాణానికి పట్టణానికి చెందిన అనుముల రామకృష్ణ భారీ విరాళం అందజేశారు. ఆయన తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ. 1,01,116లను విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. ఎం ఉమామహేశ్వరరావు, మంచిరాజు మురళి, ఎస్‌కె సంధాని, బి కోటేశ్వరరావు, గోనుగుంట సుబ్రమణ్యం, తటపర్తి సత్యన్నారాయణ, ఏకాంబరం సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

2051 మంది రైతుల రిజిస్ట్రేషన్

కందుకూరు రూరల్: మండలంలో రబీ సీజన్‌లో శనగ పంట సాగుకు 2052 మంది రైతులు ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు వ్యవసాయాధికారి వి.రాము తెలిపారు. కాక్–1 (తెల్ల శనగలు) రకం విత్తనాలకు 2043 మంది రైతులకు 2734 క్వింటాళ్లు, జెజీ–11 (ఎర్ర శనగలు) రకం విత్తనాలకు 8 మంది రైతులు 10 క్వింటాళ్లు కావాలని ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఆర్డీఓ స్పందనకు 24 వినతులు

కనిగిరి రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనకు 24 అర్జీలు వచ్చాయి. కనిగిరి మండలం నుంచి 4, సీఎస్ పురం నుంచి 3, వెలిగండ్ల నుంచి 2, పామూరు 11, పీసీపల్లి 1, హెచ్ఎం పాడు 1, మద్దిపూడి నుంచి 2 అర్జీలను ఆర్డీఓ పాలపర్తి జాన్ ఇర్విన్‌కు అందచేశారు. అర్జీలను పరిశీలించి తక్షణ సమస్యల పరిష్కారానికి అధికారులను ఆర్డీఓ ఆదేశించారు. డీఏఓ బసిరెడ్డి జయవర్ధన్‌రెడ్డి, వివిధ మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల బోర్డులు ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ ప్రకాశం

కనిగిరి రూరల్: మండలంలోని ప్రతి సచివాలయంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వచ్చిన సంక్షేమ పథకాల లబ్ధిదారుల డిస్‌ప్లే బోర్డులను విధిగా ఏర్పాటు చేయాలని ఎంపీపీ దంతులూరి ప్రకాశం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఈనెల 9 నుంచి 23 వరకు మండలంలోని ప్రతి సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. సచివాలయ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రోగ్రాం నోడల్ అధికారిగా ఈఓఆర్డీ అన్నమ్మను నియమించినట్లు చెప్పారు. ఎంపీడీఓ జేవీబీ మల్లికార్జునరావు, మండల అధికారులు, సచివాలయ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.